28 నుంచి మంత్రి బొత్స జిల్లా పర్యటన

విశాలాంధ్ర-విజయనగరం : మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి డిసెంబరు 28న ఉదయం జిల్లాకు చేరుకుంటారు. ఆరోజు మధ్యాహ్నం 3-00 గంటలకు గుర్ల మండలం కొండగండ్రేడు చేరుకొని గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం భవనాలను, తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారు. ఇళ్లపట్టాల పంపిణీ చేపట్టడంతోపాటు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు రామలింగాపురం చేరుకొని విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, సొసైటీ గోడౌన్, సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రారంభించి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. 29న ఉదయం 10.30కు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలోపాల్గొంటారు. మధ్యాహ్నం 4.00 గంటలకు గరివిడి మండలం వెదుళ్లవలసలో బి.టి.రోడ్డు ప్రారంభం, విద్యుత్ సబ్‌స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అక్కడ బహిరంగసభలో ప్రసంగిస్తారు. 30న మెరకముడిదాం మండలం శాతంవలసలో పెరుమాలి వరకు నిర్మించిన రోడ్డును, రైతుభరోసా కేంద్రం, గ్రామ సచివాలయం భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. 31న ఉదయం 10.30 గంటలకు బొబ్బిలి మండలం పక్కిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విజయనగరం చేరుకుంటారు

ప్రభుత్వ కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవ్ : కలెక్టర్ నాగలక్ష్మి



విశాలాంధ్ర-రామభద్రపురం : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమని అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని రామభద్రపురం, ఆరికతోట గ్రామాలలో సచివాలయం పరిధిలో ఉన్న ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలను ఆమె పరిశీలించారు. రామభద్రపురం జిల్లా పరిషత్ హై స్కూల్ లో కనీసం సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమం జరిగేటప్పుడు కుర్చీలు, బెంచీలు, టెంటు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ఏం కార్యక్రమం జరుగుతుందో ఇతరులకు తెలిసే అవకాశం ఉంటుందని అన్నారు. ఏమి ఏర్పాటు చేయకుండా ఆటల పోటీలు నిర్వహించడం సమంజసం కాదని అధికారులు ను మందలించారు. క్రీడా ప్రాంగణంలో స్కోరుబోర్డు కచ్చితంగా ఏర్పాటు చేయాలని అన్నారు. క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్టు మండలమంతా ప్రచారం జరిగేటట్టు చూడాలని కోరారు. కనీసం అధికారుల మధ్య అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కబడ్డీ బ్యాట్మెంటన్, పోటీలు , సెటిల్ పోటీలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే ఈ ఏడాది 105 కోట్లు రూపాయలు ధాన్యము సేకరణ కొరకు మిల్లర్ల వద్ద నుంచి బ్యాంక్ గ్యారెంటీ తీసుకోవడం జరిగిందని అన్నారు. అలాగే మరో మూడు రెట్లు అధికముగా బ్యాంక్ గ్యారెంటీ మిల్లర్ల వద్ద నుంచి తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. అలాగే 1 లక్ష 750 మెట్రిక్ టన్నుల ధాన్యమును ఇ ప్పటి వరకు సేకరించడం జరిగిందని అన్నారు.. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఆ ప్పికొండ సరస్వతి, మండల విద్యాశాఖ అధికారి తిరుమల ప్రసాదు, పెంటయ్య, ఎంపీడీవో రమమని,తాసిల్దార్ సులోచన రాణి, వ్యవసాయ అధికారి పెంటయ్య, హెడ్మాస్టర్ కామేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లాప్ వెహికల్ డ్రైవర్లను తొలగించడం సరికాదు

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రంగరాజు

విశాలాంధ్ర- విజయనగరం టౌన్ : క్లబ్ వెహికల్ డ్రైవర్లను ఏ కారణం లేకుండా తొలగించడం సరైన పద్ధతి కాదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు, ఏపీ స్వచ్ఛంద క్లాప్ వెహికల్ డ్రైవర్స్& వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పొడుగు రామకృష్ణ అన్నారు. బుధవారం ఏ కారణం లేకుండా ఏడుగురు డ్రైవర్లను తొలగించడానికి నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరములుగా డ్రైవర్లుగా గొడ్డు చాకిరీ చేయించి ఏ కారణం లేకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా డ్రైవర్లను తొలగించడం అన్యాయం అన్నారు. ఈ విషయంపై ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామిని కలిసినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఈ విధంగా డ్రైవర్లను అర్ధాంతరంగా తొలగించడం వల్ల వీరి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనికి సంబంధించిన యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి శ్రీను, ఆర్ శంకర్ తదితర కార్మికుల పాల్గొన్నారు.

జిల్లాలో 626 సచివాలయాలకు రూ.62.60 లక్షలు : కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. జిల్లాలో 626 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒక్కో సచివాలయ పరిధిలో పోటీల నిర్వహణ ఖర్చుల కోసం రూ.10 వేల వంతున రూ.62.60 లక్షలు జిల్లాలోని ఆయా సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని 530 సచివాలయాలకు రూ.53 లక్షలు, 96 పట్టణ ప్రాంత వార్డు సచివాలయాలకు రూ.9.60 లక్షలు విడుదలైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులు క్రీడా మైదానాల వద్ద పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకై తగిన ఏర్పాట్లు చేయాలని ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులను ఆదేశించారు

ఇచ్చిన హామీలను అమలు చేయాలి : వీఆర్ఏలు



విశాలాంధ్ర-జామి: 2017 మార్చి 24 వతేదీన ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో నేటి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి విఆర్ఎల దీక్షా శిబిరానికి వచ్చి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని విఆర్ఎలు డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాప్త యూనియన్ పిలుపుమేరకు ఆందోళన బాట పడుతున్న విఆర్ఎలో అందులో భాగంగా బుధవారం తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసారు. అనంతరం వీరు విలేఖరులతో మాట్లాడుతూ విఆర్ఎలకు తెలంగాణా మాదిరిగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న విఆర్‌వో, వాచ్‌మేన్ ఇతర పోస్టులలో విఆర్ఎలకు ప్రాదాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన రూ.500డిఎ ను 2018 జూన్‌నుంచి వేతనంతో కూడిన డిఏగా తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం అధ్యక్షుడు రేవెళ్ళ అప్పలరాజుతోపాటు పలువురు పాల్గొన్నారు.

రైతులకు భూ హక్కు పత్రాలు ఎమ్మెల్యే అందజేత



విశాలాంధ్ర-బొబ్బిలి: నియోజకవర్గం బొబ్బిలి మండలం కారాడ గ్రామంలో సుమారు 20.80లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అర్హులైన రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ,వేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి,వైస్ ఎంపీపీ డొకల జ్యోతి, సర్పంచ్ చొక్కాపు సరస్వతి,జేసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, వైసీపీ నాయకులు సంజీవ నాయుడు, శేఖర్,బొద్దల సత్యనారాయణ,ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

సత్యా డిగ్రీ & పీజీ కళాశాలలో సెమినార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సీతం ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ సతీష్ కుమార్. బుధవారం సత్య, పీజీ కళాశాలలో కమ్యూనికేషన్ టీపీషన్ స్కిల్స్ గురించి మార్గ నిర్దేశంచేశారు. ఆధునిక సమాజంలో నైపుణ్యాలను పెంపొందించడంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇంగ్లీష్ అనేది ప్రపంచ భాష అని ప్రతీ వారికి తెలుసు మరియు ఈ పోటీ ప్రపంచంలో పెరుగుతున్న పోటీలకు సరిపోయేలా ప్రతి ఒక్కరూ భాషపై పట్టు సాధించాలని తెలిపారు.జీవితంలో విజయం సాధించాలంటే, లక్ష్యాలను చేరుకోవ డానికి విద్యార్హతలతో పాటు ఆంగ్ల నైపుణ్యాలు తప్పనిసరి అన్నారు. ఈ సెమినార్‌లో, అశాబ్దిక సంభాషణపై చిట్కాలు మరియు యాక్టివ్ లిజనింగ్‌పై ముఖ్యమైన అంశాలు ఎక్కువగా చర్చించబడ్డాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ సరిగా చెయ్యలేకపోతే ఇంటర్వ్యూ లో విజయం సాధించడం కష్టం అని విద్యార్థులు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అధ్యాపకులు మరియు డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

వరి చేను ఆడే యంత్రం తిరగబడి ఇద్దరు మృత్యువాత



విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో అంట్లవార గ్రామంలో బుధవారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. అంట్లవార గ్రామానికి చెందిన సుమారు 15 మంది మహిళలు రోజువారీకూలి పనుల నిమిత్తం వరి చేను నూర్చే యంత్రం వద్దకు పనికి వెళ్లారు. వరి చేను ఆడిస్తున్న క్రమంలో మిషన్ ఆ యంత్రం ప్రమాదవశాత్తు తిరగబడి అక్కడే వున్న ఇద్దరు మహిళలు గంటరమణమ్మ, భీమశింగిశాంతమ్మ పై పడింది. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. చనిపోయిన గంట రమణమ్మ కు ఒక కొడుకు ఒక కూతురు, భీమసింగి. శాంతమ్మ కు ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు. ఆ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయని, వారిలో ఒకరికి నడుము విరిగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. క్షతగాత్రులను తెర్లాం పిహెచ్ కు గ్రామస్థులు తీసుకువెళ్లగా అక్కడ నుంచి రాజాం కేర్ హాస్పిటల్ కు 108లో తరలించారు. తెర్లాం ఎస్సై రమేష్ నాయుడు సిబ్బంది తో అంట్లవార గ్రామానికి చేరుకుని ఘటన స్థలంలో పరిశీలించారు. దీంతో ఆ గ్రామంలో వెంటనే విషాదఛాయలు అలముకున్నాయి.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఇంటిని ముట్టడించిన అంగన్వాడీలు

ప్రభుత్వానికి లేఖ రాస్తానని కోలగట్ల హామీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: అంగన్వాడీల సమ్మె 16వ రోజు కొనసాగుతుంది. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం బాలాజీ జంక్షన్ నుంచి అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు ప్రదర్శనగా వెళ్లి డిప్యూటీ స్పీకర్ ఇంటినీ ముట్టడిం చారు.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అందరినీ లోనికి పిలవడంతో అంగన్వాడీలు సమస్యలను వివరించారు. వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ అధికార పార్టీలో ఉన్న కారణంగా మీ దగ్గరకు వచ్చి మద్దతు తెలియజేయలేకపోయానని, మీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి పైడ్రాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బి. సుధారాణి,నగర కార్యదర్శి బి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం మొండిగా ఉంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్, నగర కార్యదర్శి సుంకర సతీష్, తదితరులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో విశాలాక్షి, శివలక్ష్మి, ప్రసన్న, జయ సత్యవతి ఈశ్వరమ్మ లలిత రత్న పాల్గొన్నారు.

అస్వస్థకు గురైన అంగన్వాడీ కార్యకర్త

నిరసనలో చోటుచేసుకున్న ఘటన

విశాలాంధ్ర-గరివిడి: పట్టణంలో తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా గత కొద్ది రోజులుగా అంగనవాడి సిబ్బంది శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు. బుధవారం ఉదయం అంగన్‌వాడి కార్యకర్త అప స్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అక్కడ ఉన్న తోటి సిబ్బంది ఆందోళన చెందారు. ఆమెకు ప్రథమ చికిత్సచేసి వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. ఆమె గత కొన్ని రోజులుగా గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రంలోకి రావడం వల్ల నీరసించడం వల్లే జరిగిందదన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం అంగన్వాడి యూనియన్ అధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం చొరవచూపించి అంగన్వాడి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నిక ల ముందు ఇచ్చిన హామీలను మాత్రమే అమలు చేయమని అడుగుతున్నామని, మా హామీలు అన్నీ న్యాయపదంగానే ఉన్నాయని, సుప్రీంకోర్టు సైతం అంగన్వాడీలకు న్యాయం చేయాలని తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం దాన్ని తుంగలో తొక్కింది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, మాట తప్పని, మడమ తిప్పని నాయకుడిగా నిలవాలని అంగన్వాడి సిబ్బంది కోరారు. ఘటన స్థలంలోకి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనీవాస్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను చక్కదిద్దారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు

తామరపల్లి కూడలిలో రైతులతో ధర్నా

విశాలాంధ్ర-గంట్యాడ : రైతులు రాత్రనకా పగలనకా ఆరుగాలం పండించిన పంటను రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారని రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు మండిపడ్డారు. బుధవారం తామరపల్లి కూడలిలో రైతులతో చేపట్టిన ధర్నాలో కామేశ్వరరావుతో పాటూ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దేగల అప్పలరాజు ధర్నాలో పాల్గొని రైతులకు న్యాయం జరగాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తుఫాన్ ప్రభావం వల్ల తడిచి న మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్లు కొంటారని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రజా ప్రతినిధులు చెప్పారని దీనికి విరుద్ధంగా గంట్యాడ మండలంలో మిల్లర్లు వ్యవహరిస్తున్నారని మిల్లుకు తెచ్చిన ధాన్యంలో రైతుల వద్ద నుంచి తేమ శాతం వంటి కుంటిచాకులు చెప్పి రైతులను భయాందోళనకు గురిచేసి అక్రమంగా 10 కేజీలు ధాన్యాన్ని దోపిడీచేస్తున్నారని రైతులు తన వద్ద వాపోయారని అన్నారు. రైతులుకు న్యాయం జరగాలని ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలను పాటించి రైతులకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామని అందు వల్ల తామరపల్లి కూడలిలో రైతులతో ధర్నా రాస్తారోకో చేపట్టామని తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో ధర్నా చేస్తూ ఆందోళన చేపట్టడం జరుగుతుందన్నారు తక్షణమే ప్రభుత్వ స్పందించి అక్రమ మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కడుబండి కి వినతి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, సిటూ, ఐఎఫ్టియు నాయకుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావుకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి స్పందిస్తూ అంగన్వాడీలు ఇచ్చినటువంటి నాలుగు డిమాండ్లపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సమాజంలో గౌరవంగా బ్రతకాలంటే కనీస వేతనం రూ.26,000, గ్రాడ్యుటి ఐదు లక్షలు, మినీ అంగన్వాడీలకు మెయిన్ అంగన్వాడీలకు ఇస్తున్నటు వంటి జీతాన్ని మినీలకు ఇవ్వాలని, చివరి జీతంలో సగం పెన్షన్ రూపంలో ఇవ్వాలని, అలాగే హెల్పర్లకు రూ.7500 జీతం ఉన్నప్పటికీ వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదు కాబట్టి రకరకాల కారణాలు చూపించి వీరికి సంక్షేమ పథకాలు రాకుండా ఇబ్బంది పడుతున్నారనే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి అంగన్వాడీలు, సంఘాల నేతలు తీసుకురాగా ప్రభుత్వంతో మాట్లాడి వీలైనంతవరకు వీరి సమస్యతో పాటు మిగతా అంశాలను ప్రభుత్వ దృష్టిలో పెడతానని ఎమ్మెల్యే కడుబండి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, కమిటీ మెంబర్ చెలికాని ముత్యాలు, సిఐటియు అనుబంధం అంగన్వాడి ప్రాజెక్టు లీడర్ డి శ్యామల, డి జయలక్ష్మి, ఏఐటీయూసీ అనుబంధ సంఘ ప్రాజెక్టు మహిళా నేతలు వి. మాణిక్యం, కే సుశీల తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు వబ్బినసత్యనారాయణ, లోక్సత్తా పార్టీ నాయకులు ప్రసాద్ మద్దతునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలం ఎంఆర్ నగరం గ్రామం సమీపంలో ఒరిస్సా వెళ్తున్న ప్రధాన రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం పార్వతీపురం మండలం రావికోన గ్రామానికి చెందిన వాటక కుమార్, వాటక రోజా పార్వతీపురం వెళ్లి సుమారు సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు ఎమ్మార్ నగరం సమీపంలో గల ఒరిస్సా వెళ్తున్న రోడ్డు పైన గుర్తుతెలియని మోటార్ సైకిల్ ఢీకొని వెళ్లిపోయింది. వైద్యం చేస్తున్న డాక్టర్ మాట్లాడుతూ ఇరువురికి గాయాలయ్యాయని ప్రాణనష్టం లేదు అన్నారు.

మామిడిపల్లి పంచాయతీ లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ

విశాలాంధ్ర - సాలూరు రూరల్: మండలంలో మామిడిపల్లి పంచాయతీలో బక్కుపేట, పిట్టాడవలస, కరాసు వలస పంచాయతీలో గడివలస,మర్లవలస గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల.పరమేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ ఇంచార్జ్ గుమ్మడి సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెదేపా మ్యానిఫెస్టోలో ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాలకి ప్రజలలో విశేష స్పందన లభిస్తుందన్నారు. పై గ్రామాలలో ప్రతీ గడపకి వెళ్లి పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. ఆడబిడ్డ నిధి,తల్లికి వందనం,దీపం పథకం,మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను వివరించామన్నారు.5 ఏండ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. యువగళం నిధి రూపంలో నెలకు 3000 రూపాయలు, అన్నదాతకు ఏడాదికి 20 వేల రూపాయలు, బిసి లకు రక్షణ చట్టం, పేదలను సంపన్నులు చేస్తాం,ఆదాయం రెట్టింపు చేస్తామని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అంతేకాకుండా ప్రజలంతా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు.ఈ కార్యక్రమం లో వీరితో పాటు సీనియర్ తెదేపా నాయకులు బూసతవుడు, దొంక అన్నపూర్ణ అప్పికొండ యుగంధర్, రమాదేవి,ఆముజూరి శ్రీనివాసరావు, అక్కాన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జనవరి 12 వరకు క్లైయిమ్‌ల అభ్యంతరాలు స్వీకరణ: కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం: ఓటరు జాబితాపై క్లైములు, అభ్యంతరాలను జనవరి 12వరకు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం - 2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీలతో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం జరిగింది. జనవరి 22న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో 42362 ఫారం-6, 46094 ఫారం-7, 97227 ఫారం-8 అందాయని ఆయన పేర్కొన్నారు. ఈ జిల్లాకు చెంది ఇక్కడ ఓటు కలిగి ఉండటంతో పాటు ఇతర ప్రాంతాలతో ఓటు హక్కు కలిగి ఉన్నవారి సమాచారం ఉంటే అందించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఓటరు సవరణ ప్రక్రియ చక్కగా జరిగిందని, తమకు ఎటువంటి సందేహాలు, అనుమానాలు లేవని, జిల్లా యంత్రాంగం బాగా పనిచేసిందని వివిధ పార్టీల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె వెంకటరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి వెంకట నాయుడు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి.రవికుమార్ , బి.ఎస్.పి. పార్టీ ప్రతినిధి టి.వెంకటరమణ, బిజేపి ప్రతినిధి పి.అప్పారావు , లోక్ సత్తా పార్టీ ప్రతినిధి ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస రాణా వార్షిక తనిఖీ చేపట్టిన ఎస్పీ

విశాలాంధ్ర-కురుపాం: వార్షిక తనిఖీలలో భాగంగా జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి మంగళవారం తనిఖీచేపట్టారు జిల్లా యస్.పి. విక్రాంత్ పాటిల్ . ఈసందర్భంగా చినమేరంగి సర్కిల్ సిఐ కె. మురళీధర్, జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్ పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు ,అనంతరం సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లోని ఎస్ హెచ్‌ఓ, రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను మరియు కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదులు, సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ యొక్క చుట్టుపక్కల పరిసరప్రాంతాలను పరిశీలించినారు. పెండింగ్ లో ఉన్న కేసులను మరియు క్రైమ్ రికార్డులను, కేసు నమోదు మొదలు, కోర్టు డిస్పోజల్ వరకు గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు, , రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్, ఇతర కేసుల యొక్క సిడి ఫైల్స్, పెండింగ్ ట్రయల్ కేసుల ఫైళ్ళు, స్టేషన్ లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్టు కు సంబంధించిన రికార్డ్స్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు . కేసులలో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేసారు. ప్రియారిటీ కేసులు గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా నిందితులకు శిక్ష పడేలాచూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహనతనిఖీలు నిర్వహించాలని మరియు నాటు సారా తయారీ, అక్రమ రవాణా చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్ఫోర్స్మెంట్ వర్క్ (డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ డ్రింకింగ్) ఎక్కువగా నమోదుచేయాలని, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలని, రానున్న ఎలక్షన్ దృష్ట్యా గ్రామాలను సందర్శించి ముందస్తు సమాచారం సేకరించాలని ,సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం,పోలీసు సిబ్బంది తో జిల్లా ఎస్పీ గారు మమేకమై, వారి యొక్క గ్రీవేన్సు అడిగి తెలుసుకొన్నారు.

పెట్రోల్ బంక్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఎ ఆధ్వర్యంలో పాలకొండలో నూతనంగా నిర్మించబడిన పెట్రోల్ బంక్ లో ఉద్యోగాలకు ఇంటర్యులు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన రాతపరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సూపర్ వైజర్ 1 పోస్ట్, పంపుబాయ్ 7 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏపీవో రోసి రెడ్డి, ఏఏవో విజయరాణి, డిప్యుటీ డీఈవో లిల్లీరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీటి రహదారి నిర్మాణంతో బల్లుకోట దీర్ఘకాలిక సమస్య తీర్చిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కురుపాం: నిత్యం రహదారి లేని కారణంగా అవస్థలు పడుతున్నా తమకు బి.టి రహదారి నిర్మాణం జరిగేలా విశేషమైన కృషి చేసి అనతికాలంలోనే పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యే పాముల. పుష్పశ్రీవాణి కి బల్లుకోట గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. బుధవారం కురుపాం మేజర్ పంచాయతీ పరిదిలో ని టేకరఖండి గొటివాడ పంచాయతీ బళ్ళు కోట వరకు3.2కిలోమీటర్లు 1 కోటి 76 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన బి టి రహదారిని కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో దశాబ్దాల సమస్య తీరిందని బల్లుకోట గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత, సర్పంచ్ జి.సుజాత ,మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, నాయకులు నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వ రరావు, గొటివాడ సర్పంచ్ తట్టమ్మ ,ఎంపీటీసీ సునీత ,గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు డిఈఈ సింహాచలం,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడువేల లీటర్ల నాటు సారా ధ్వంసం

విశాలాంధ్ర -పార్వతీపురం టౌన్: విశాఖపట్నం జోన్ డిప్యూటీ కమిషనర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, డి. శ్రీరామ చంద్రమూర్తి ఉత్తర్వుల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ ఓ. దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 16 నుండి అక్టోబర్ 31 వరకు పట్టుబడిన 26 కేసుల్లో సీజ్ చేయబడిన 3000 లీటర్ల నాటుసారాను నవిరి కాలనీ సమీపంలో పాత తోటపల్లి రోడ్డులో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ బి . ఈశ్వరరావు ఆధ్వర్యంలో మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేయడం జరిగిందాని ఎస్ఈబి ఇన్ స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో అయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఐటిడిఏ ను రక్షించుకుందాం : 31న జిల్లా సదస్సు

కరపత్రాలు విడుదల చేసిన ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు

విశాలాంధ్ర - బెలగాం : డిసెంబర్ 31వ తేదీన పార్వతీపురంలో జరిగే గిరిజన సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నేతలు పి. రంజిత్ కుమార్, పి. శ్రీనునాయుడు, టి. సాయిబాబు, ఎం. భాస్కరరావులు పిలుపునిచ్చారు. ఈమేరకు ఐటిడిఎ కార్యాలయంలోని "అడవితల్లి" విగ్రహం ఎదుట కరపత్రాలు విడుదల చేసారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ఐటిడిఎలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందన్నారు. మన్యం జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటిడిఏకు గిరిజనులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ఐటిడిఏ పాలన లేకుండా పోయిందని విమర్శించారు. గిరిజనులను అభివృద్ధి పథంలో నడపటానికి, గిరిజన సమస్యలను పరిష్కరించేందుకు, గిరిజన ప్రజలను రక్షణగా నిలిచేందుకు, గిరిజన చట్టాల అమలు కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎలు కనీసం పాలక వర్గ సమావేశానికి నోచుకోలేదని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్వతీపురం ఐటిడిఏ పాలక వర్గ సమావేశం ఒక్కసారి మాత్రమే జరిగిందని జిల్లా ఏర్పాటు తరువాత ఐటిడిఏలో జరిగే స్పందన కార్యక్రమంలో ఐటిడిఏ పిఓ ఉండే పరిస్థితి లేదన్నారు. మరో వైపు గిరిజన సంక్షేమ కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులు ఇతర పనులకు ఖర్చు చేస్తున్నారని ఐటిడిఏ ద్వారా గతంలో మాదిరిగా రుణాలు ఏమి ఇవ్వడం లేదని ,వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయడం లేదని తెలిపారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఎటువంటి ఉపాధి, శిక్షణా కార్యాక్రమాలు లేవని, గిరిజన పాఠశాల, కళాశాలల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. గిరిజన విద్యను పర్యవేక్షణ చేయాల్సిన కీలకమైన డిడి పోస్టు భర్తీ చేయాలని అలాగే గిరిజన వైద్య సేవలు సక్రమంగా అందే విధంగా చూడాల్సిన మరో కీలకమైన ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పోస్టు భర్తీ కూడా భర్తీ చేయాలని డిమాండ్ చేసారు. నేటికీ అనేక గిరిజన గ్రామా లకు గిరిజనులే రోడ్లు వేసుకుంటున్నారని , షెడ్యూల్డ్ గ్రామాల గుర్తింపు ప్రక్రియ ప్రకటనలకే మరిమితమయ్యిందని, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కుక్, కమాటీ, వాచ్ మేన్, ఎఎన్ఎం లేరని, గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు లేరని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు ప్రిన్సిపాల్ పోస్టులు కూడా ఇంచార్జీ లేనని గిరిజన విద్యార్థుల మరణాలు కొనసాగుతోందన్నారు. జిసిసి సరుకులు సరఫరాకే పరిమిత మయ్యిందని, ఇంకో వైపు బోయ/వాల్మీకులను గిరిజన తెగల జాబితాలో కలపాలని అసెంబ్లీలో తీర్మానం చేసి గిరిజనులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని, గిరిజన ప్రాంతాల్లో భూములను రక్షించేందుకు ఏర్పాటు చేసిన స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురం నుండి పార్వతీపురానికి తరలించారని, పార్వతీపురంలోని ఎటిడబ్లీఓ ఆఫీసు ఎత్తేసారని అన్నారు. 1/70చట్టం, పీసా చట్టం అమలు లేదని, జీవో నెంబరు 3 రద్దు చేశారని, ఇలాంటి అనేక సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోరాడి సాధించుకున్న ఐటిడిఎను కాపాడుకోవాలని అందులో భాగంగా ఐటిడిఎను రక్షించుకుందాం, గిరిజన సమస్యలు పరిష్కరించుకుందాం, అనే నినాదంతో పోరాటాలు చేసేందుకు డిశంబర్ 31న పార్వతీపురంలోని గిరిజన సామాజిక భవనంలో ఉదయం 10 గంటలకు గిరిజన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని అందరూ పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈకార్యక్రమంలో గిరిజన యువత పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న సర్వశిక్ష సిబ్బందికి లక్ష రూపాయల సాయం

విశాలాంధ్ర-కురుపాం: నాలుగు నెలలుగా జీతాలు లేకుండా తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న సర్వశిక్ష సిబ్బందికి కురుపాం మండల ఉపాధ్యాయులు రూ.1,01,000/- సహాయం అందజేశారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ లో ఎంఈఓలు ఎస్ సత్యనారాయణ, రాధా కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యా యులు తోట శంకర రావు, రామగోవింద యూనియన్ ప్రతినిధులు కరువులు, చలపతి, జగదీశ్వర రావు, భమిడిపాటి మూర్తి, సంగం నాయుడు, అప్పన్న దొర, వి.వెంకట రమణ సమక్షంలో సర్వశిక్ష సిబ్బందికి నగదు అందజేయడం జరిగింది.

చలో కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కురుపాం: వీఆర్ఏల సమస్యలపై ఈనెల 28వ తేదీన కలెక్టరేట్లో చేపడుతున్న ధర్నాకు జిల్లాలో గల వీఆర్ఏల అందరు పాల్గొని జయప్రదం చేయాలని వీఆర్ఏల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భం గా ఆయన మంగళవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విజయవాడ అలంకార్ చౌరాస్తా వద్ద వీఆర్ఏలు చేపట్టిన ధర్నా సభా స్థల వద్దకు వచ్చి నేను గెలిచిన వారం రోజుల్లోనే వీఆర్ఏల జీతాలు పెంచుతానని అలాగే వారి డిమాండ్లు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి నేటికీ నాలుగున్నర సంవత్సరాలు అవుతున్న ఆయన మాటలు నీటి మూటలగే మిగిలాయని కావున వీఆర్ఏల హక్కుల సాధన కోసం చేపడుతున్న ధర్నాకు పెద్ద ఎత్తున వీఆర్ఏలు పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వాలీబాల్ జెకె పాడు, కలిగొట్టు జట్ల మధ్య హోరాహోరీ పోరు

విశాలాంధ్ర -పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట పంచాయతీ భద్రగిరి గిరిజన గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంలో జరిగిన క్రీడలలో జెకె పాడు, కలిగట్టు జట్లు మధ్య హోరాహోరీగా వాలీబాల్ క్రీడ జరిగింది. జెకెపాడు కాలనీ వారు విజయం సాధించారు. ఆడదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడలు చూడటానికి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వందల వేల మంది క్రీడాకారులతో పాటు చిన్న పిల్లల నుండి పెద్దలు, వృద్ధులు భారీగా తరలిరావడం విశేషం. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పి.ఈ.టి.లు, సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే జోగారావుకు వినతి

విశాలాంధ్ర-బెలగాం : అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు లీడర్లు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీ మణి, అంగన్వాడి జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వారాడ ఇందిరా, జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, సిఐటియు పట్టణ నాయకురాలు బొత్స లక్ష్మి ఆధ్వర్యంలో 16వ రోజు సమ్మెలో భాగంగా బుధవారం పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఆయన ఇంటి వద్ద వినతి పత్రం అందచేశారు. మా సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు తెలియజేయగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జోగారావు మీ సమస్యలు పరిష్కారం కోసం నా వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. సమ్మెకు ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ప్రాజెక్టు పరిధిలో దీక్షాశిబిరం వద్ద పోలవరం మండలం, టి. కొత్తపల్లి అంగన్వాడి ఆయా జి. సుగుణమ్మ నిన్న నిరవధిక సమ్మె శిబిరంలో నినాదాలు ఇస్తూ కుప్పకూలిపోయారు. ఆమెను హాస్పిటల్ తీసుకెళ్లే సరికి ఆమె చనిపోయారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మూడు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు గౌరీమణి, కె. రాజేశ్వరి సెక్టార్ లీడర్లు అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి...

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ కార్మికుల రెండవ రోజు సమ్మెలో భాగంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె శిబిరం వద్ద ఒంటి కాలుపై నిలుచుని వినూత్నంగా నినాదాలు ఇచ్చి నిరశన తెలిపారు. అంగన్వాడి జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు పట్టణ నాయకురాలు బొత్స లక్ష్మి, అంగన్వాడి ప్రాజెక్టు లీడర్లు మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సెక్టార్ లీడర్లు కె. రాజేశ్వరి, ఎం. గౌరీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆప్కాస్ విధాన కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అందరికీ హెల్త్ అలవెన్స్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చీపురుపల్లి సింహాచలం, పడాల గాంధీ, మామిడి శివ, బంగారు రాజేష్, గుంట్రెడ్డి గంగయ్యలు, ఇప్పలమ్మ, పాపులమ్మ పడాల సంతు, వెంకన్న, సాయి, రవి, సత్తిరాజు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఆరు రోడ్లకు ఫారెస్ట్ క్లియరెన్స్

విశాలాంధ్ర-కురుపాం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లోని ఆరు రోడ్లకు జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ అటవీ అనుమతులు ఇచ్చింది. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధ్యక్షతనగల కమిటీ, రెవెన్యూ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖలతో కూడిన సంయుక్త తనిఖీ నివేదికను పరిశీలించింది. ఆయా గ్రామాలను ప్రధాన స్రవంతిలోకి అనుసంధానించడానికి, గిరిజనులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి దాని ప్రాముఖ్యత దృష్ట్యా రోడ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఆరు రోడ్ల కోసం గిరిజన సంక్షేమ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రతిపాదనలు సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం బబ్బిడి బిటి రోడ్డు నుండి రావివలస వరకు 0.314 హెక్టార్లు, కూసా - నొంద్రుకోన రహదారి నుండి యెడకల్లు వరకు 0.300 హెక్టార్లలో, కురుపాం మండలం నవరగూడ జంక్షన్ నుండి బండిగూడ వరకు 0.93 హెక్టార్లు, బల్లెరు నుంచి నవరగూడ 0.49 హెక్టార్లు, టీలేసు నుంచి గుమడంగి 0.93 హెక్టార్లు, తెన్నుఖర్జ నుంచి గొటివాడ వరకు 0.95 హెక్టార్లకు అవసరమగు అనుమతులు మంజూరు చేయడం జరిగింది. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగానికి ఇప్పటి వరకు 13 అటవీ అనుమతులు లభించాయి. నిర్ణీత సమయంలో ప్రతిపాదనలను క్లియర్ చేయడంలో అధికారులు కృషి చేసినందుకు జిల్లా కలెక్టర్ శ్రీ నిశాంత్ కుమార్ అభినందించారు. కమిటి సభ్యులు, పాచిపెంట జెడ్పిటిసి కొర్రజన్ని సింహాచలం మాట్లాడుతూ జిల్లా కొత్తగా ఏర్పడటం జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అటవీ అనుమతులు సకాలంలో జారీ చేయడంతో పాచిపెంట మండలంలో దాదాపు అన్ని గ్రామాలకు రహదారుల నిర్మాణం జరుగతోందని, గ్రామాల సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్, జిల్లా అటవీశాఖ అధికారిణి జీఎపి ప్రసూన, గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె శాంతీశ్వరరావు, ఐటిడిఎ ఎపిఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం వద్ద అంగన్వాడీల ధర్నా



విశాలాంధ్ర-గజపతినగరం: సమస్యలు పరిష్కరించాలని గజపతినగరం వైసిపి కార్యాలయం వద్ద బుధవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు వి లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది శిబిరం వద్ద నుండి ర్యాలీగా వెళ్లి వైసిపి కార్యాలయం వద్ద పలు నినాదాలు చేస్తూ ధర్నా జరిపారు అనంతరం వాళ్లు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే అప్పల నరసయ్య అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం సుభాషిని పి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

437 సచివాలయాల పరిధిలో 637 మ్యాచ్ ల నిర్వహణ

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా జిల్లాలో రెండో రోజు గురువారం 437 గ్రామ, వార్డు సచివాలయల పరిధిలో ఐదు క్రీడాంశాలకు సంబంధించి 601 మ్యాచ్ లు జరిగాయి. జిల్లాలోని 27 మండలాలు, నాలుగు పట్టణాల పరిధిలో యీ మ్యాచ్ లు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, ఎం.పి.డి.ఓ, మునిసిపల్ కమిషనర్ లు తమ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో పర్యటించి క్రీడా పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు.

తమ సమస్యలు పరిష్కరించాలి : ఎంఈఓ కి వినతి



విశాలాంధ్ర-శృంగవరపుకోట: సిఐటియూ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ నరసింగరావుకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటి యూనియన్ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నేటికీ 23 ఏళ్లగా ప్రభుత్వానికి ఇటు స్కూల్ పిల్లలకు సేవలు అందిస్తున్నారన్నారు. వీరంతా నిరుపేదలు.. ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాలకు చెందినవారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న అరకొర 300 రూపాయల వేతనాన్ని తీసుకుంటూ తమ కుటుంబ పోషణ చేసుకుంటున్నారు. నేటికి మూడు నెలలు కావస్తున్న బకాయి జీతాలు, వంట సరుకుల బిల్లులు ఇంతవరకు చెల్లించలేదన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెలలో సమ్మెలోకి వెళ్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిటూ మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం జిల్లా కమిటీ నాయకులు జె సన్యాసమ్మ మండల కమిటీ సభ్యులు ఏ భవాని, డి లక్ష్మి, వై దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే నూతన భూహక్కు చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

కోర్టు విధులు బహిష్కరించిన ఎస్.కోట న్యాయవాదులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త భూహక్కు చట్టాన్ని (ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023) తక్షణం ఉపసంహరించుకోవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయ వాదులు డిమాండ్ చేశారు. ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యూ.ఎన్.శర్మ మాట్లాడుతూ ఈ చట్టంతో స్థానిక కోర్టులకు విచారణ పరిధి లేకుండా చేశారన్నారు. కేవలం టైటలింగ్ అధికారులకే అధికారం ఇవ్వడం వల్ల వీరిపై రాజకీయ జోక్యం పెరిగే అవకాశం ఉందని, పేద రైతులు మరింతగా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఇందుకు సంబంధించిన వాజ్యాలను హైకోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం లేక పేద రైతులు ఇక్కట్లు పడతా రన్నారు. రైతాంగ సమస్యలు, భూ సమస్యలు సత్వరం పరిష్కరించే యోచ న ఉంటే కోర్టులు పెంచి, ఉద్యోగుల సంఖ్య పెంచి భూ కేసులను పరిష్కరించాలని సూచించారు. నూతన భూహక్కు చట్టం ఉపసంహరించాలని కోరుతూ ఈనెల 29వ తేదీ వరకు కోర్టు విధులు బహిష్కరణ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ నిరసన కార్యక్రమంలో న్యాయ వాదులు బి.త్రిమూర్తులు, జి.ప్రకాష్, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, జి.చిట్టిబాబు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బొడ్డు వెంకటరావు, బి.శివశేఖర్ బాబు, వసంత శ్రీనివాసరావు, బీవీఎస్ రామారావు, సంతోష్, కర్రి వెంకటరమణ, బొబ్బిలి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలి

ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు సూర్యారావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: గ్రామసభలను సక్రమంగా నిర్వహించడంతో పాటు వెంటనే గ్రామసభల షెడ్యూల్ విడుదల చేయాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యా రావు కోరారు. వేదిక ప్రతినిధి సిహెచ్ రామకృష్ణతో కలిసి ఎస్.కోట ఎంపిడిఓ కార్యాలయానికి వెళ్లి గ్రామసభ షెడ్యూలు వెంటనే రిలీజ్ చేయమని కోరుతూ ఏవో శ్రీనివాసరావుకి వేదిక వ్యవస్థాపకులు సూర్యారావు బుధవారం వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా డి.సూర్యారావు మాట్లాడుతూ ఈ సంవత్సరానికి ఆఖరి నాల్గవ రాజ్యాంగబద్ధ గ్రామసభలు వచ్చే నెల రెండు నుంచి జరగనున్నాయని, ఈ గ్రామ సభలకు వారం రోజులు ముందుగా గ్రామ సభల షెడ్యూలు విడుదల చేయవలసి ఉండగా నేటికీ అటువంటి దాఖలాలు కనబడడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గ్రామసభల సక్రమ నిర్వహణపై జిల్లా పంచాయతీ అధికారికి ఈ నెల 15న చార్వాణి ద్వారా రిప్రజెంటేషన్ పంపించడం జరిగిందని, ఆయన స్పందిస్తూ జిల్లాలో ఉన్న అందరి అధికారులకు ఈ గ్రామసభల సక్రమ నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇప్పటికైనా జిల్లాలో ఉన్న ఈవోపీఆర్డీ లందరూ గ్రామ సభల షెడ్యూలు విడుదల చేసి పత్రికల ద్వారా ప్రజలకు తెలిసేలా చేయాలని, అలాగే గ్రామ సభలు పర్యవేక్షణను జిల్లా, మండల స్థాయి అధికారులు చేపట్టాలని సూర్యారావు డిమాండ్ చేశారు.

ఆరోగ్య శ్రీ పథకం సేవలు పై అవగాహన కల్పించాలి

ఐటిడిఎ పీవో కల్పనకుమారి



విశాలాంధ్ర-సీతంపేట: ఆరోగ్య శ్రీ పథకం పరిమితిని రూ 5 లక్షల నుంచి రూ 25 లక్షల రూపాయల వరకు ప్రభుత్వం పెంచిందని, దీనిపై ఆసుపత్రికి వచ్చే రోగులకు, గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఐటిడిఎ పీవో కల్పనకుమారి అన్నారు. బుధవారం ఐటిడిఎ పరిధిలోగల పీహెచ్ సీల వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా పీవో మాట్లాడుతూ చాలా గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య శ్రీ పథకంపై పూర్తి స్థాయిలో అవగాహన లేదని, కాబట్టి అలాంటివారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు అందించే ప్రయివేట్ ఆసుపత్రుల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఆరోగ్య మిత్రల సమాచారం ఆసుపత్రుల వద్ద ప్రదర్శించాలని అన్నారు. రోగులు ఆసుపత్రిలో జాయిన్ అయిన వెంటనే ఆరోగ్య శ్రీ పథకం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. శ్రీకాకుళం ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆరోగ్య శ్రీ పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రకాష్ రావు, వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి 5న భామినిలో జగనన్నకు చెబుదాం: కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : మండలస్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం జనవరి 5న భామిని మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. భామిని మండల పరిషత్ కార్యాలయంలో ఆరోజున ఉదయం 10గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలని ఆయనఆదేశించారు.

అంగన్వాడీల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళండి : ఎమ్మెల్యే కు వినతి



విశాలాంధ్ర-కురుపాం: రెండు వారాలుగా అంగన్వాడీ సమస్యలు పై చేపడుతున్న నిరసనలలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కి అంగన్వాడీ లు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో భాగంగా అంగన్వాడీ లను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఐదేళ్లు కావస్తున్నా సమస్యలు పరిష్కరం కాలేదని తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని అంగన్వాడీ సమస్యలు ప్రభుత్వం దృష్టి కి తీసుకుని వెళ్ళాలని కోరారు.

సవరవిల్లిలో సహకార బ్యాంకు ప్రారంభం



విశాలాంధ్ర-భోగాపురం: మండలంలో సవర విల్లి గ్రామంలో సహకార బ్యాంకు శాఖను డి.సి.సి.బి చైర్మన్ వేచలపు వెంకటరాము నాయుడు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనా యుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం పోలిపల్లి గ్రామానికి చెందిన రెండు డ్వాక్రా సంఘాలకు 20 లక్షల రుణ మంజూరు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డి.సి.సి.బి చైర్మన్ మాట్లాడుతూ సవరవిల్లిలో 22 వ సహకార బ్యాంకు శాఖను ఏర్పాటు చేశామని, అన్ని రకాల వ్యవసాయ,హౌసింగ్, తదితర అన్ని రుణాలను మిగతా అన్ని బ్యాంకుల మాదిరిగా అందజేస్తామన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలందరూ ఈ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని కోరారు.ఎమ్మెల్యే అప్పలనాయుడు మాట్లాడుతూ సవరవిల్లి లో బ్యాంకును ప్రారంభించడం శుభ పరిణామమని, సవరవిల్లి నుంచి బ్యాంకులకు వెళ్లాలంటే సుమారు 10 కిలోమీటర్లు వెళ్లాల్సిఉంటుందని ఇక అలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రాంత ప్రజలుకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. త్వరలోనే ఈ బ్యాంకు దిన దినాభివృద్ధి చెందుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి సీఈఓ కెంబూరి జనార్ధనరావు, వైసిపి కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సవరవిల్లి సర్పంచ్ ఉదయ భాస్కర రెడ్డి, ఎంపిటిసి పట్నాల తాతయ్యలు, వైసిపి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు .

వైసీపీ మాటల ప్రభుత్వం కాదు.... చేతల ప్రభుత్వం

విశాలాంధ్ర-కురుపాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హామీలు గాలికి వదిలేసే మాటల ప్రభుత్వం కాదని మాట ఇచ్చిన హామీలు అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసే ఏకైక చేతల ప్రభుత్వం అని మాజీ ఉపముఖ్యమంత్రి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. బుధవారం తోటపల్లి-గుణుపూర్ రోడ్ నుండి గొటివాడ గ్రామానికి 1కోటి 20లక్షలతో 1.5 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణిచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రెండు, మూడు ధఫాలు బి.టి రహదారి మంజూరు అయినట్లు ప్రకటించిన నాయకులు కనీసం పనులు కూడా ప్రారంభించడానికి కూడా రాలేదని...ఇచ్చిన హామీలను సకాలంలో పూర్తికి ముందుగా అటవీశాఖ అనుమతి తీసుకుని పనులు ప్రారంబిస్తున్నామని తెలిపారు. అనతికాలంలోనే నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తిచేసి గొటివాడ ప్రజలకు అంకితం ఇస్తామని అన్నారు. కార్యక్రమం లో సర్పంచ్ తోయక తట్టమ్మ, ఎంపీటీసీ టి.సునీత, ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ సుజాత,నాయకులు నాగేశ్వరరావు,అంధవరపు కోటేశ్వరరావు,మండల కన్వీనర్ గౌరీశంకర్, తోయక. కోటేశ్వరరావు సర్పంచ్ లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంచిచేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మంచి చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. ఎస్. కోట-1 సచివాలయ పరిధిలో పుణ్యగిరి, రేగ పుణ్యగిరి గ్రామల్లో '298వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి గడపలోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు వుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ, నేరుగా ప్రజలతో కలసి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన పరిపాలన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమౌతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి ముఖ్యమంత్రి పంపిన లేఖను అందజేసారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. గత టీడీపీ పాలనలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చెదనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకుని మళ్లీ వైఎస్సార్సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫోక్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మండలపార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, పట్టణ అధ్యక్షుడు రెహమాన్, ఎంపీటీసీ దారగిరి, కడారి అప్పయ్య, వార్డు సభ్యులు మజ్జి శేఖర్, సీదరి అర్జున్, బార్నో, నారాయణ మూర్తి, పెనుగంటి జగదీష్, సోషల్ మీడియా కోకన్వీనర్ మామిడిబుజ్జి , కడారి జయశంకర్, ఆవాల కృష్ణ, చిప్పడ రమణ, యలమంచిలి అప్పలసత్యం, మోపాడ ఈశ్వరరావు, యలమంచిలి ఈశ్వరరావు, మోపాడ కోటి, నక్కా నాగరాజు, సచివాలయం సిబ్బంధి, ఆశావర్కర్లు, వాలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అక్రమాలను అరికట్టాలి : జనసేన నేత గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ధాన్యం కొనుగోలులో అక్రమాలను అరికట్టాలని జనసేన నేత గురాన అయ్యలు డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూరైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరి ధాన్యాన్ని ఏవేవో సాకులు చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.రైతుల వద్ద నుండి క్వింటాకు అదనంగా5 కిలోల ధాన్యం తూకంవేస్తున్నారన్నారు.అలాగే ఖర్చుల పేరుతో రైతుల వద్ద నుండి క్వింటాకు 12 నుండి 15 రూపాయిలు వసూల్ చేస్తున్నారని ఆరోపించారు.ధాన్యం తూకంలో కూడా మోసాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లన రైతులు కన్నీరు కారుస్తున్నారన్నారు. రైతులను కన్నీరు పెట్టించట%శీ% మంచిది కాదన్నారు. బరితెగిస్తున్న అక్రమార్కుల వైపు అధికార యంత్రాంగం కన్నెత్తి కూడా చూడటం లేదన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ దారుణంగా వుందని ఆరోపించారు. చేతికొచ్చిన సమయంలో తుఫాన్ వల్ల పంటలు పాడయ్యాయని, మిగిలిన పంటలను రైతులు నూర్పులు వేసి కళ్లల్లో నిల్వచేశారన్నారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మకాలు చేసుందుకు ఆర్బికెల చుట్టూ, మిల్లుల చుట్టూ తిరుగుతూ, పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళారులబారీన పడి రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. నేరుగా రైతుల కల్లాలకు వెళ్లి కొనుగోలు చేసే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మన్యం జిల్లాలో ఇచ్చినట్టు విజయనగరం జిల్లా లో కూడా తూర్పు గోదావరి జిల్లా మిల్లులకు ధాన్యం కొనుగోలు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న సంక్రాంతి పండగని దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే స్పందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో వరి ధాన్యం సేకరణ, రవాణా చేపట్టాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో జనసేన పార్టీ తరుపున రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

టిడిపిలో చేరిన బక్కుపేట సర్పంచ్

విశాలాంధ్ర-పార్వతీపురం: సీతానగరం మండలంలోని బక్కుపేట సర్పంచ్ గొట్టాపు మంగమ్మ, అతనిభర్త మాజీ సర్పంచ్ గొట్టాపు అప్పారావు,గ్రామానికి చెందిన 50 కుటుంబాలు తెలుగు దేశం పార్టీ లో బుదవారం చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబుకు రోజు రోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సాల హరిగోపాల్, దామినేని భానుప్రసాద్ , గొట్టాపు వెంకటనాయుడు, బార్నాల సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన ఆడుదాం ఆంధ్రా

విశాలాంధ్ర-సీతానగరం: వైసీపీ ప్రభుత్వం యువతలో క్రీడలపట్ల అభిరుచిని పెంచడానికి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు రెండో రోజు జరిగాయి. మండలంలోని జోగమ్మపేటలోని బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల మైదానంలో,సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో, బూర్జ, గాదెలవలస, నిడగల్లుగ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు.మండలంలోని 2828మంది పురుషులు, 555మంది మహిళలు ఆడుదాం ఆంధ్రా క్రీడలు క్రికెట్, వాలీబాల్ , బ్యాడ్ మింటన్, ఖో ఖో, కబడ్డీ ఆటలకు రిజిస్ట్రేషన్ చేసుకోగావారంతా ఆడుతున్నట్లు ఎంపిడిఓప్రసాద్ చెప్పారు.జోగమ్మపేట, సీతానగరం, బూర్జ, నిడగల్లు, గాదెలవలస, ఆర్ వెంకమ్మపేట, మరిపివలసలలో ఉన్నతపాఠశాలల మైదానంలోజరుగుతున్న క్రీడలను ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ ప్రసాద్, తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎస్ఐ ఎం.రాజేష్, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, ప్రజా ప్రతినిదులు, సచివాలయం సిబ్బంది,వ్యాయామ ఉపాధ్యాయులు,వివిద సచివాలయంల సిబ్బంది, సెక్రటరీలు, వివిధ గ్రామాల క్రీడాకారులు ,వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

ఆడుదాం ఆంధ్రా ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి పెంపు

రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు





విశాలాంధ్ర-బలిజిపేట/ పార్వతీపురం: క్రీడాసం స్కృతిని, క్రీడాస్ఫూర్తిని గ్రామ స్థాయి నుండి పెంచడానికి తద్వారా ఆరోగ్య కరమైనజీవనశైలిని యువతలో పెంచడానికి ఆడుదాం ఆంధ్రా గొప్ప వేదికని రాష్ట్ర ఎస్టి కమీషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకరరావు అన్నారు. బుదవారం నాడు బలిజిపేట మండలంలోని పెదపెంకి ఉన్నతపాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడలలో ఆయన పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త క్రీడోత్సవం ఆడుదాం ఆంధ్ర అన్నారు. ఫిబ్రవరి 10 వరకు వివిధ దశల్లో జరిగే ఈఆటల పండుగ దేశంలోనే వినూత్నమన్నారు. రాష్ట్రంలో ప్రతీగ్రామంలోఆసక్తిఉన్న పౌరులందరూ పాల్గొనే అవకాశం కల్పించిన ఆటల పోటీల ద్వారా లక్షలాది మంది పాలుపంచుకోవడం బహుశా ఏదేశం లోనూ జరిగి ఉండదన్నారు. ఆరోగ్య సమాజం ఏర్పాటు ధ్యేయం సాధనలో ఈ కార్యక్రమం కీలకం కానుందని ఆయన చెప్పారు. దేశంలో క్రీడా సంస్కృతి రానురాను తగ్గిపోతోందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల తారతమ్యం లేకుండా త్వరితంగా మాయమవుతుందని పేర్కొన్నారు. ఫలితంగా ఎంతో క్రీడా శక్తి నిరుప యోగంగా మారుతోందని చెప్పారు. నూరు కోట్ల ప్రజలున్నా అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు వేళ్ళ మీద లెక్కించే సంఖ్యలో ఉండడం దీనికి సాక్ష్యమని చెప్పారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి లోపిస్తోందని, ఫలితంగా ఓటమిని తట్టుకోలేకపోవడం, టీమ్ మెంబర్ గా వ్యవహరించలేకపోవడం యువతలో సాధారణమైందని అన్నారు.పోటీ పరీక్షలకు చదువుల రాజధానిగా ఉన్న రాజస్తాన్ కోట, విద్యార్థుల బలవన్మరణాలకు కూడా దేశ రాజధానిగా మారడం ఓ విషాదకరమని పేర్కొన్నారు. ఈ ఏడాది 30 మంది విద్యార్థులు ప్రాణాల్ని తీసుకున్నారని, కార్పొరేట్ చదువుల్లో క్రీడలకు కనీస ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వల్ల భౌతికంగా,మానసికంగా వారు బలహీనులుగా తయారవుతున్నారని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో శారీరక ఆరోగ్యం పట్ల, ఫిట్ నెస్ పట్ల అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జీవన శైలి వ్యాధులు దేశంలో ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నాయని, చక్కెర వ్యాధికి దేశం ప్రపంచ రాజధానిగా మారిందని, వాటి నియంత్రణలో ఫిజికల్ ఫిట్ నెస్ ది కీలక పాత్ర అన్నారు. ప్రజల్లో శారీరక ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచడానికి ఆడుదాం ఆంధ్ర తోడ్పడగలదని ఆయన స్పష్టం చేశారు. క్రీడా సంస్కృతిని, క్రీడా స్ఫూర్తిని గ్రామ స్థాయి నుండి పెంచడానికి తద్వారా ఆరోగ్య కర జీవన శైలిపట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆడుదాం ఆంధ్ర కన్నా గొప్పవేదిక ఉండబోదని, మిగతా రాష్ట్రాలకు కూడా ఈప్రోగ్రాం అనుసరణీయం కాబోతుందని పేర్కొన్నారు. దీన్ని ఏర్పాటు చేసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందనీయులన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ అప్పలరాజు, మండల విద్యా శాఖ అధికారి సామల సింహాచలం, మండల , గ్రామ ప్రజా ప్రతినిదులు,నాయకులు సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'సత్తారు' చూపు ఎటువైపు?

కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలుకు దూరంగా ఉంటున్న వైనం

బైరీపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కట్టబెట్టకపోవటమే కారణమా?

విశాలాంధ్ర-మెరకముడిదాం: మెరకముడిదాం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గర్భాం-2 మాజీ ఎంపిటిసి సత్తారు జగన్మోహన్ రావు గత కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలుకు దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చానీయాంశగా మారింది. మొట్టమొదట రాజకీయ ప్రవేశం తెలుగుదేశం పార్టీ తో మొదలు అయ్యి అంచెలంచలుగా ఎదిగి అప్పట్లో దివంగత నేత తెర్లాం మాజీ శాసనసభ్యులు తెంటు జయప్రకాష్ కు అత్యంత సన్నిహితుడుగా పేరు గడించారు. తర్వాత కొన్ని రాజకీయ పరిణామాలు దృష్ట్యా గతంలో రాష్ట్ర మంత్రి బొత్స సత్యన్నారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్ధం పుచ్చుకున్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు మంత్రి బొత్సకు అత్యంత సన్నిహితుడుగా, శిష్యుడు గా పేరు సంపాదించుకున్నారు. సత్తారు జగన్మోహన్ రావు, ఆయన సతీమణి సుధారాణి గర్భాం-2 నుండి మూడు సార్లు ఎంపిటిసి గా గెలుపొందగా, సుధారాణి ఒకసారి టిడిపి తరుపున జెడ్పీటిసి గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే గర్భాం మేజర్ పంచాయతీలో సర్పంచ్ గా ఎవరు గెలుపొందాలన్నా సత్తారు మద్దతు తప్పనిసరిగా ఉండాలి. ఎందుకంటే ఈయనకు గర్భాం లో 1 నుండి 5 వార్డులు వరకు, పంచాయతీ మధురా గ్రామాల్లో కూడా ప్రజల్లో మంచి బలముంది. అందువలన పంచాయతీ ఎన్నికల్లో ఈయన సూచించిన వ్యక్తి గెలుపొందటం పరిపాటిగా మారింది. అయితే ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో గర్భాం- 2 నుండి ఎంపిటిసి గా పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేయగా, అప్పట్లో బైరీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టేందుకు పార్టీ అధిష్టానం హామీ ఇచ్చి పోటీ నుండి విరమింపజేసింది.దీంతో ఆ సెగ్మెంట్ నుండి ఎంపిపి అభ్యర్థి అయిన తాడ్డి కృష్ణవేణిని బరిలోకి దించి ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు. స్థానిక సంస్థ ఎన్నికలు పూర్తి అయ్యి సంవత్సరాలు గడుస్తున్నా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టకపోవటంతో సత్తారు మనస్థాపానికి గురై పార్టీ, అభివృద్ధి కార్యక్రమాలుకు దూరంగా ఉంటునట్లు రాజకీయ వర్గాలు సమాచారం. పార్టీ కార్యక్రమాలుకు దూరంగా ఉన్నప్పటికీ ఇంతవరకు పార్టీ ఫిరాయిస్తారా? లేక ఇదే పార్టీలో కొనసాగుతారా? అన్న విషయం బయటకు రాకపోవటంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలయ్యింది. గర్భాం మేజర్ పంచాయతీతో పాటు మండలంలో కొంత ప్రజా బలం ఉండటంతో ఒకరిద్దరు దేశం పార్టీ నేతలు సత్తారు జగన్మోహన్ రావుతో రహస్య మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే మరో రెండు, మూడు నెలల్లో శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గౌరవం, ప్రాధాన్యత లేని వైసీపీ పార్టీలోనే కొనసాగుతారా? లేక తల్లి పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ లో చేరుతారా అన్నది చర్చానీయాంసంగా మారింది. చీపురుపల్లి నియోజకవర్గం నుండి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొత్స సత్యన్నారాయణ పోటీ చేస్తే సత్తారు పార్టీ ఫిరాయించే అవకాశం లేదని, ఒకవేళ కొత్త వ్యక్తి గాని ఎమ్మెల్యే బరిలోకి దిగితే పార్టీ మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదేవిధంగా పార్టీ అధిష్టానం వ్యవహారసైలి కొనసాగితే సత్తారు స్థానిక సంస్థ ఎన్నికల్లో మాత్రం పార్టీ ఫిరాయించే అవకాశం మెండుగా ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా త్వరలో జరబోయే సార్వత్రిక ఎన్నికల్లోగా "సత్తారు "సొంత పార్టీలోనే కొనసాగుతారా? లేక వేరే పార్టీలో చేరుతారా? అన్నది వేచిచూడాల్సిందే.

యువత క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : యువత క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. ఎస్.కోట మండలం మూలబొడ్డవర గ్రామ సచివాలయం పరిధిలోని, డా.వరలక్ష్మి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎస్.కోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలో జరుగుతున్న "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమంలో షటిల్ బాడ్మింటన్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర పోటీలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ఉద్దేశించి ఎమ్మెల్సీ మాట్లాడుతూ క్రీడాకారులకు అత్యంత ఆవశ్యకమైనది క్రీడా స్ఫూర్తి అని, మంచి ఆరోగ్యానికి ?క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వ్యాయామం వల్ల బీపీ, డయాబెటిక్ వంటివి అదుపులో ఉంటాయన్నారు. గ్రామస్థాయిలో క్రీడలు ఎంతో అవసరమని.. అందుకే ప్రభుత్వం మంచి ఆలోచన చేసి గ్రామ స్థాయి క్రీడల పోటీల దిశగా అడుగులు వేస్తుందన్నారు. గ్రామాల్లోని క్రీడా ఆణిముత్యాలను వెతికి దేశానికి అందించడమే ఈ "ఆడుదాం ఆంధ్ర" కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని, గ్రామస్థాయి క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, మాజీ ఎం.పి.పి ఒంటి అప్పారావు, స్థానిక సర్పంచ్ కుమారి మీనా, ఎం.పి.టి.సి లక్ష్మి, వైస్ సర్పంచ్ అప్పారావు, పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, ఎం.పి.టి.సి బోదల దేముడు, నాయకులు మురళీరాజు, సన్యాసిదేముడు, లగుడు ఈశ్వరరావు, పి.అప్పారావు, గౌరీపురం బుల్లి, సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాడు విద్యార్థి - నేడు ఉపాధ్యాయుడు

రూ.10 వేలు విలువైన విద్యా సామగ్రి పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ : నిజానికి నేటి సమాజంలో గడుసుతనంతో జీవించేది ఉపాధ్యాయులు మాత్రమే అన్నసంగతి అందరికీ తెలిసిందే. నాడు బ్రతకలేక బడి పంతులు ఉద్యో౼మనే వారు. నేడు బ్రతక నేర్చిన ఉపాధ్యాయులుగా ముద్ర వేసుకున్నారు.కానీ కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం అందుకు భిన్నంగా ఉంటారు. జన్మభూమికి చదువుకున్న స్కూలుకు ఎంతో కొంత ఉపకారం చేయాలన్న తలంపుతో ఉంటారు.తద్వారా పలువురికి ఆదర్శంగా నిలుస్తారు.ఇదే కోవకు చెందుతారు మండలంలోని బల్లంకి గ్రామానికిచెందిన తాడాన అప్పారావు మాస్టారు. నాడు గ్రామంలోని సర్కారు బడిలో చదివి నేడు గ్రామాంతరంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న అప్పారావు మాస్టారు అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పవచ్చు. వివరాల్లోకి వెళ్తే బల్లంకి గ్రామానికి చెందిన అప్పారావు మాస్టారు బుధవారం చదివిన స్కూలు రుణం తీర్చుకోవాలన్న తలంపుతో జన్మించిన తల్లిదండ్రుల పేరు మీద స్కూలులోని విద్యార్థులందరికీ రూ.10వేలు విలువ చేసే పెన్నులు, స్కేల్లు,జామెట్రీ బాక్సులు తదితర స్టేషనరీ సామాగ్రిని ఇతోధికంగా అందజేశారు.అలాగే స్కూలులో ఉపాధ్యాయులకు పెన్నులు, ఫలాలు అందించారు.ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు ఇమంది జగదీశ్వరరావు,ఎన్ శ్రీరాములు, ఎస్.అప్పారావు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ జగ్గారావు,గ్రామ వైసీపీ నాయకుడు బొడ్డు శ్రీనివాసరావు తదితరుల పాల్గొన్నారు.

అరకు పార్లమెంట్ పరిధిలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి కృషి

బీజేపీ పార్లమెంట్ నాయకులు డాక్టర్ హేమానాయక్

విశాలాంధ్ర - బెలగాం : అరకు పార్లమెంట్ పరిధిలో భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు అరకు పార్లమెంటు బిజెపి పార్టీ నాయకులు డాక్టర్ వి. హేమా నాయక్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అరకు పార్లమెంట్ పరిధిలో గల కురుపాం, పాలకొండ, పార్వతీపురం, సాలూరు, అరకు, రంపచోడవరం, పాడేరు నియోజకవర్గం పరిధిలో గ్రామస్థాయిలో బిజెపి పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తున్నానని, అరకు పార్లమెంట్ పరిధిలో గల బిజెపి పార్టీ జిల్లా, మండల పార్టీ అధ్యక్షులతో కలసి పార్టీ అభివృద్ధికి ప్రయత్నం చేస్తున్నా నన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. అరకు పార్లమెంట్ పరిధిలో బిజెపి పార్టీ బలోపేత మౌతుందని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాల పట్ల ప్రజల స్పందన బాగుందన్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రధానమంత్రి గృహ నిర్మాణ యోజన పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఉచిత గ్యాస్ నిరుపేదలకు అందించడం జరుగుతుందన్నారు. అరకు పార్లమెంట్ పరిధిలో అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు. కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులతో రహదారుల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని, రాష్ట్రంలో బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి ఆధ్వర్యంలో పార్టీ పూర్తిస్థాయిలో బలోపేత మౌతుందన్నారు. అరకు పార్లమెంట్ పరిధిలో గిరిజన ప్రాంతం అధిక శాతం ఉందని అనేక గిరిజన గ్రామాలకు ఇప్పటికీ రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కొన్ని గిరిజన గ్రామాలకు విద్య, వైద్య సౌకర్యాలు సక్రమంగా అందటం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించాలని కోరారు.

సేవలు సమాజ హితానికి ఉపయుక్తం కావాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉద్యోగంలో అందించిన సేవలు సమాజ హితానికి ఉపయుక్తం కావాలని పెంక్షన్ దారులను ఉద్దేశించి డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే పింఛన్దారుల సంఘ భవనంలో అంతర్జాతీయ పింఛన్దారుల దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని ప్రతి ఒక్కరి ఆరాటమని, అందుకు తగ్గ ఏర్పాట్లు ముందుగానే చేసుకోవడం పించిందారులకు వరం లాంటిదని అన్నారు. ఇందుకు గతంలో డిఎస్ నకారా అందించిన సేవలు మరువలేని వని అన్నారు. పించిన్దారుల సమస్యలను పరిష్కరించేందుకు చక్కటి వేదికగా ఏర్పాటు చేసిన ఘనత వి.ఎస్.శాస్త్రి దేనని చెప్పారు. ఉద్యోగంలో చేసిన సేవలు అనంతరం సమాజాభివృద్ధికి ఉపయుక్తం కావాలని ఆమె కోరారు. పించిందారులకు ఏ సమస్యలు ఉన్నా అవి పరిష్కరించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పింఛన్దారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తారని చెప్పారు. అనంతరం వివిధ సేవలు అందించిన పలువురు పింఛన్దారులకు సమావేశంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పింఛన్దారుల సంఘం అధ్యక్షులు బి.విశ్వనాథ్, నాయకులు కుప్పారావు, వెంకట్రావు, సుబ్బారావు, పెద్దింటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మన్యం వ్యవసాయ పద్ధతులపై ఒడిస్సా రైతులు సందర్శన

విశాలాంధ్ర- సీతంపేట : ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ విధానాలు తో రైతులు అధిక దిగుబడులు సాధించి లాభాలను పొందే విధానాలపై అవగాహన కల్పించే భాగంలో ఒడిస్సా రాష్ట్రం నుండి కలహండి జిల్లా రైతులు 80 మంది మన్యం ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు ద్వారా గిరిజన రైతులు పండిస్తున్న పంటలను క్షేత్రస్థాయిలో మూడు రోజులు పాటు పర్యటించి వ్యవసాయ విధివిధానాలను తెలుసుకోవడం జరుగుతుందని ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. మండ వాటర్ షెడ్ ప్రాంతంలో చెరువులు, చెక్ డ్యాములు, నేల బావులు ద్వారా భూగర్భ జల సంరక్షణ చేపడుతున్నటువంటి విధానాలను ఒడిస్సా రైతులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. అనంతరం కుషిమి ఎఫ్ బి ఓ సభ్యులతో సమావేశం అయ్యారు, అనంతరం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా దారిమల్లీ, కుషిమి, నవ్ గుడా, గ్రామాల్లో పర్యటించారు ఈ కార్యక్రమంలో బాబు ప్రసాద్ మిశ్రా, దిలీప్ కుమార్ సడంగి, మన్యం సీఈవో బి శంకర్రావు, ధనరాజు, ఆర్ట్స్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - బెలగాం : అగ్ని ప్రమాదాలు సంభవించి నపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, అగ్ని ప్రమా దాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్వతీ పురం ఎస్ఎఫ్ఓ పి. పైడిరాజు బుధవారం సౌందర్య థియేటర్ వెనుక కాలనీలో గల ఎస్.ఎస్.ఎస్. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతీపురం అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ పి. పైడిరాజు వివిధ రకములైన అగ్నిప్రమాద కారణాలు, సంభవించే వేళ తీసుకోవాల్సిన నివారణ చర్యలపై విద్యార్థులకు సిబ్బందికి అవగాహన కల్పించే విధంగా తన సిబ్బందితో ఫైర్ డెమో నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. అనంతరావు, ఫైర్ సిబ్బంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ముగిసిన 14వ బ్యాచ్ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : బుధవారం స్థానిక విజయ నగరం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజీ వద్దఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ నందు హెవీ వెహికల్ డ్రైవింగ్ పూర్తి చేసుకున్న 14వ బ్యాచ్ డ్రైవర్స్‌కు ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పల నారాయణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుశిక్షితులైన ఆర్టీసీ వద్ద శిక్షణ పొందడం వలన క్రమశిక్షణ తో కూడిన అలవాట్లు అలవరచుకోవలి అని మరియు భవిష్యత్తు లో మంచి డ్రైవర్స్‌గా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీనివాసరావు మరియు శిక్షకులు డివిఎన్ రాజు పాల్గొన్నారు.

కురుపాం ఎంపీడీవోగా అప్పారావు

విశాలాంధ్ర - కురుపాం : కురుపాం మండల నూతన ఎంపీడీవోగా ఎస్.అప్పారావు బుధ వారం బాధ్యతలు స్వీకరించారు. కురుపాం ఎంపీడీవో ఇటీవల గుండె పోటు మరణించిన తర్వాత ఈఓపిఆర్డీ జి.రమేష్ బాబు అధనపు బాధ్యత లు చేపట్టారు. పెందుర్తిలో ఈఓపిఆర్డీగా పని చేస్తున్న ఎస్ .అప్పారావు పదోన్నతి రావడంతో కురుపాం రెగ్యులర్ ఎంపీడీవో గా నియమించడంతో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, రాయి తీలు అర్హులైన వారందరికీ అందేలా చూస్తూ అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రక్తదాన శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - గజపతినగరం : జాతీయ గీతం జన గణ మన పాడిన రోజు పురస్కరించుకొని బుధవారం గజపతినగరం సాయి సిద్ధార్థ కళాశాల లో రక్తదాన శిబిరం విజయవంతంగా జరిగింది విద్యార్థులు అధ్యాపకులు యాజమాన్య సభ్యులు 54 మంది రక్తదానం చేశారు కళాశాల కరస్పాండెంట్ ఎస్ చంద్రశేఖర్ 42 వ సారి రక్తదానం చేయడం విశేషం కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్ పెద్ది నాయుడు ఎస్ శారదా నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది రక్తనిధి డాక్టర్ మైత్రేయి ప్రిన్సిపల్ కెవి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం మండలంలోని మరుపల్లి గ్రామంలో గల హైస్కూల్లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు ఆటల పోటీలు నిర్వహణ పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్ ఎంపీడీవో కే కిషోర్ కుమార్ గ్రామ సర్పంచ్ లంక రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను నమ్మించి నమ్మక ద్రోహం చేసిన సీఎం జగన్ రెడ్డి

నియోజకవర్గ తెదేపా ఇంఛార్జ్ కోళ్ల లలిత్ కుమారి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : రాష్ట్ర ప్రజలను నమ్మించి సీఎం జగన్మోహన్ రెడ్డి నమ్మక ద్రోహం చేశారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాలనలో ఈ ముఖ్యమంత్రి నూటికి నూరు శాతం విఫలం అయ్యారని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. ఎస్.కోటలోని పుణ్యగిరి రోడ్డులో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ వద్ద టీడీపీ నేతలు బుధవారంవిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు అందరూ ఓటు అనే ఆయుధంతో జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి పంపించడం ఖాయమని జోస్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన 120 సంక్షేమ పథకాలు ఒక్కటీ కూడా అమలు కాకుండా ఆపి వేయడమే కాకుండా రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్ గా తీర్చి, నా ఎస్సీ, ఎస్సి, బీసీ, మైనార్టీ అంటూ ఏ ఒక్క కార్పొరేషన్ సబ్ నిధులు ఇవ్వకుండా నిలిపివేసి, వారిని అనేక విధాలుగా అక్రమ కేసులు బనాయించి, మానసికంగా, ఆర్థికంగా బాధపెట్టి, ఆఖరికి చంపే స్థాయికి వచ్చినా సరే తన అధికారంలో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాలను గాలికి వదిలేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కుతుందని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి నువ్వు అసలు రాష్ట్రానికి గడిచిన 57 నెలలో ఏమి చేశారో చెప్పగలరా అని సూటి ప్రశ్న వేశారు. పట్టి సీమను గాలికి వదిలేసి, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి, అమరావతి రాజధానిని మార్చబోనని, అమరావతిలోనే ఇంటి నిర్మాణం చేసుకొని రాజధానిని కడతానని ప్రజలని నమ్మించావు?, కృష్ణా, తుంగభద్ర జలాలపై హక్కుల్ని పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేసి రాయలసీమ ప్రాజెక్టులకు, యువతకు ప్రతీ ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి నమ్మక ద్రోహం చేసాడని ఆరోపించారు. అదేవిధంగా విద్యుత్ ఛార్జీలు, రైతు భరోసా, మధ్యపాన నిషేధం చేసిన తరువాతనే 2024 ఎన్నికలలో ఓట్లు అడుగుతానని నమ్మబలికి, మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టు పెట్టి, నాసిరకం మద్యం ద్వారా అమాయకమైన ప్రజలు, మహిళల మంగళ సూత్రాలను తెంచి, ప్రజలు అనేక వ్యాధులకు గురౌతున్నా పట్టించుకోకుండా పాలన సాగిస్తున్నారని ఎద్దేవాచేశారు. ఆఖరికి ఇంటిలో ఉన్న తల్లికి, చెల్లికి ద్రోహం చేసి, చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య కేసులో ఉన్న నిందితులకు మద్దతును ఇస్తూ, కోడి కత్తి డ్రామాలు వేస్తున్న జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులను, జీతాలు పెంచుతామని అంగన్ వాడీలను, పర్మినేట్ ఉద్యోగాలు చేస్తానని, మున్సిపల్ కార్మికులను, భూ దందాలు, మైనింగ్ మాఫియా, డ్రగ్స్, మద్యం, గంజాయి, చెప్పుకుంటూపోతే ఒకటా, రెండా రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసి, ఆఖరికి వీళ్ళే నా సైన్యం అన్న వాలంటీర్లు నేడు రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు, ర్యాలీలు చేస్తున్నారంటే నువ్వు చేసిన నమ్మక ద్రోహం గురించి అందరికి తెలిసిపోయింది జగన్ మోహన్ రెడ్డి. ఇక నిన్ను ఎవ్వరూ నమ్మరు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి కూటమిని గెలిపించాలని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండూ గాడిలో పెట్టే చంద్రబాబు నాయకత్వాన్ని ప్రజలు బలంగా నమ్ముతున్నారని మాజీ ఎమ్మెల్యే కోళ్ల స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శృంగవరపు కోట మండల పార్టీ అధ్యక్షులు జీ.ఎస్.నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, జడ్పీటీసీ అభ్యర్థి భీశెట్టి అరుణ, పోలిమేర లక్ష్మి, బోనంగి జ్యోతి, రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కుమార్, నియోజకవర్గ ఐటీడీపీ కార్యదర్శి అనకాపల్లి చెల్లయ్య, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు వాకాడ బాల ఈశ్వర్ భరత్ (బాలు), శృంగవరపుకోట పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), పెదగాడ రాజు, రొంగలి రమణ, మునగపాక అప్పారావు, బుత్తల సన్యాసిరావు పాల్గొన్నారు.

అత్యుత్తమ బైజూస్ కంటెంట్‌తో కూడిన నాణ్యమైన ట్యాబ్లు అందిస్తున్న ఏకైక సీఎం జగనే : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - తెర్లాం : ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి అంకురం చుట్టిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పేర్కొ న్నారు. చదువులో సమానత్వం ఉండాలనే ఉద్దేశంతో, పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు బైజూస్ కంటెంట్ తో కూడిన అధునాతన టాప్స్ ఉచితంగా అందిస్తున్న నేపథ్యంలో బుధవారం తెర్లాం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు నందు విద్యార్థిని విద్యార్థులకు ఆయన ఉచితంగా ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే శంబంగి గ మాట్లాడుతూ బైజూస్ లెర్నింగ్ యాప్ తో 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్లు అందజేయడం జరుగుతుందని ఒక్కో ట్యాబ్ విలువ 16,500 రూపాయలు మరియు బైజూస్ కంటెంట్ విలువ 15,500 రూపాయలు కలిపి ఒక్కొక్క ట్యాబ్ విలువ 32000 రూపాయలు ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు కొరకు ఇంత చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ గారిని విద్యార్థులు తల్లిదండ్రులు నిండుమనసుతో ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు,ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జడ్పీటీసీ గర్భాపు లుర్దు, వైస్ ఎంపీపీ చెపేన సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తెంటు సత్యం నాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, ఉపాధ్యాయులు, వివిధ గ్రామ సర్పంచులు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల పరిస్కారానికి గడువు పెంపు

బిఎల్ఓలతో మరోసారి తనిఖీలు చేయించాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర- విజయనగరం : ఓటర్ల సవరణ ప్రక్రియ లో భాగంగా క్లెయిమ్స్ అండ్ అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎన్నికల కమిషన్ గడువు పెంచినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. డిసెంబర్ 26 వరకు ఉన్న ఈ గడువును జనవరి 12 వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. వారం వారం నిర్వహించే సమావేశం లో భాగంగా బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో రాజకీయ ప్రతినిధుల తో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫైనల్ పబ్లికేషన్ తేదీని కూడా పొడిగించారని, జనవరి 5కు బదులుగా జనవరి 22 న ఓటర్ల తుది ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఈ వారం లో డిసెంబర్ 20 నుండి 26 వరకు ఫారం- 6 లు 855 , ఫారం -7 లు 110 , ఫారం -8 లు 923 మొత్తం 1888 ఫారాలు అందినట్లు తెలి పారు. గడువు పెంచినందున బి.ఎల్.ఓ లు మరోసారి చేర్పులను, తొలగింపులను తనిఖీ చేయాలని సూచించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ.వి.ఎం గోడౌన్ తనిఖీ ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రతినిధులంతా హాజరు కావాలని కలెక్టర్ కోరారు. బూత్ స్థాయి లో స్వీప్ కార్యక్రమాలు జరపాలని, ఈవిఎంల డెమో నిర్వహించాలని, చునావ్ పాఠశాల, పరిశ్రమలలో స్వీప్ కార్యక్రమాలను నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్లకు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి వారి సోషల్ మీడియా లో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా తదితర అంశాల ను అప్లోడ్ చేయాలని సూచించారు. నివేదికలను ఖచితమైన ప్రోఫార్మలలో ఎన్నికల కమిషన్ కు పంపడానికి ఐ.టి టీమ్స్ ను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వర రావు, సుధా రాణి, దొర, నూక రాజు, వై.సి.పి పార్టీ ప్రతినిధులు రోంగాలి పోతన్న, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

అంటిపేట వీఆర్ఏ మృతి

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని అంటిపేట గ్రామరెవెన్యూ అసిస్టెంట్ కోట సింహాచలమమ్మ (65) బుధ వారం ఉదయం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతిచెందడంపట్ల తహశీల్దార్ ఎన్వీ రమణ, సర్పంచ్ బొంగు తిరుపతిరావు, ఎంపిటిసి ఎస్.తిరుపతిరావు, సెక్రటరీ శశిభూషణ రావు, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయం సిబ్బంది, విఆర్ఏలు ,గ్రామస్తులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

పింఛన్ల పరిశీలన పూర్తి చేసిన అధికారులు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని 21గ్రామ సచివాలయంపరిదిలో కొత్తగా మంజూరు జరిగిన 230 వైఎస్సార్ భరోసా పింఛన్లను ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డి కుమార్ వర్మలు బుధవారం ఆయా సచివాలయంలకు వెళ్లి లబ్ధిదారులను కలిసి, వారి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను తక్షణమే అప్ లోడ్ చేశామన్నారు. నవంబర్ 2023లోగా ఆన్లైన్ చేసిన అర్హులలో కొన్ని పేర్లు మాత్రమే ప్రస్తుతం రాగా వాటిని పరిశీలించి అప్ లోడ్ చేయడం జరిగిందన్నారు. వారితో పాటు ఆయా గ్రామాల లబ్ధి దారులు, ప్రజా ప్రతినిదులు, సచివాలయం వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు అందజేత

సిఎం జగన్మోహన్రెడ్డి ఆరోగ్యశ్రీను 25లక్షల రూపాయలకు పెంచడంతో కొత్తగా వచ్చిన డాక్టరు వైఎస్సార్ హెల్త్ కార్డులను 21 సచివాలయంల సిబ్బందికి ఎంపిడిఓ ప్రసాద్, ఈఓపిఆర్డీ కుమార్ వర్మలు బుదవారం అందజేసి వాటిని త్వరిత గతిన గ్రామాల్లోని లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు.

ఎంపీడీవోకి సమ్మె నోటీసు ఇచ్చిన గ్రామ వాలంటీర్లు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎంపీడీవో శేషుబాబుకి సమ్మె నోటీసును గ్రామ వాలంటీర్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ వాలంటరీలను కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని లేదా గ్రామ సచివాలయ ఉద్యోగుల్లా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీంకోర్టు తీర్పు మేరకు కనీస వేతనం 18.000 ఇవ్వాలని అలాగే డిఎ 600 రూపాయలు ఇవ్వాలని సూచించారు. వీరు చేస్తున్న ఉద్యోగానికి చట్టబద్ధత కల్పించాలని, రాష్ట్ర వ్యాప్తంగా వాలంటీర్లు సమ్మెబాట పట్టేందుకు నిర్ణయిం చారన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సచివాలయ సెక్రెటరీ, ఎంపీడీవోలకు సిఐటి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారన్నారు. వాలంటీర్లు ఇంటర్మీడియట్ డిగ్రీ ఇతర డిప్లమా ఎడ్యుకేషన్ చేసి నిరుద్యోగులుగా జీవిస్తున్న వీరు తల్లి దండ్రులకు భారం కాకూడదని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి తీసినటువంటి వాలంటరీ ఉద్యోగాలకు దరఖాస్తులు పెట్టుకుని ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం మొన్న పెరిగిన దానితో 5750 రూపాయలని, ఈ జీతంతో తమ కుటుంబాన్ని పోషించుకోవడం చాలాకష్టతరంగా ఉందన్నారు. నేడు మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగాయి పెరిగిన ధరలకు అను గుణంగా మా జీతాలను కనీస వేతనం18.000 వేల రూపాయలు ఇవ్వాలని, మేము చేస్తున్న వాలంటరీ ఉద్యోగానికి చట్టబద్ధత కల్పించాలని కోరు చున్నారని గుర్తు చేశారు. వాలంటీర్లు చేస్తున్న సమ్మెకు సిఐటియు యూనియన్ సంపూర్ణ మద్దతుని ప్రకటిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మణిభూషణం, కె భారతి, సిహెచ్ శ్యామల, కె.గణేష్, ఆర్.సత్య, సిహెచ్ దేవరాజు, సాయి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు

వెంటవెంటనే ఆన్‌లైన్లో వివరాలను అప్‌లోడ్ చేయాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

బొబ్బిలి, రామభద్రాపురం గజపతినగరంలో పర్యటన

విశాలాంధ్ర - బొబ్బిలి : ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆమె బుధవారం బొబ్బిలి, రామభద్రాపురం, గజపతినగరం మండలాల్లో పర్యటించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను, ఏర్పాట్లను పరిశీలించారు. ఏర్పాట్లలో లోపాలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో బ్యాడ్మింటెన్, పాత బొబ్బిలిలో వాలీబాల్ పోటీలను కలెక్టర్ పరిశీలించారు. రామభద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న బ్యాడ్మింటెన్, కబడ్డీ పోటీలను, ఆరికతోట నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను, గజపతినగరం మండలం మరుపిల్లి జెడ్‌పి పాఠశాలలో నిర్వ హిస్తున్న కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటెన్, ఖోఖో పోటీలను కలెక్టర్ తిల కించారు. ఎన్ని రకాల క్రీడలను నిర్వహిస్తున్నారు, ఎంతమంది క్రీడాకారులు పాల్గొంటున్నారు తదితర వివరాలను తెలుసుకున్నారు. త్రాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలను, టైమ్ షెడ్యూల్, స్కోరు బోర్డు, స్కోర్ షీట్‌లను పరిశీలించారు. కొన్నిచోట్ల ఏర్పాట్లలో లోపాలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. దానికి తగినట్లుగానే ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. క్రీడా మైదానాలవద్ద నీడకోసం టెంట్లు, కుర్చీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రీడలు జరుగుతున్నప్పుడే వెంటవెంటనే ఫోటీలను, వివరాలను, లైవ్ స్కోర్‌ను ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలని, ఈ విషయంలో అశ్రద్ధ చూపించవద్దని స్పష్టం చేశారు. క్రీడా మైదానాలవద్ద కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఎక్కడైనా తప్పనిసరి పరిస్థితుల్లో మైదాన్ని మారిస్తే, ఆ విష౼యాన్ని క్రీడాకారులకు, ప్రేక్షకులకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా హెూర్డింగులను, ఫ్లెక్సీలు, మస్కట్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోటీలను మొక్కుబడిగా కాకుండా, ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా పూర్తిస్థాయి ఏర్పాట్లతో, ఉత్సాహవంతమైన వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తాశిల్దార్ డోల రాజేశ్వర రావు, ఎంపిడిఓ పి.రవికుమార్, రామభద్రాపురం ప్రత్యేకాధికారి గోవిందరావు, తాశిల్దార్ సులోచనా రాణి, ఎంపిడిఓ రమామణి, గజపతినగరం ప్రత్యేకాధికారి రమేష్, ఎంపిడిఓ కె.కిశోర్‌కుమార్, ఆయా మండలాల ఎంఇఓలు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేస్తాం

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఆమె రామభద్రాపురంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో సుమారు లక్షా, 750 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందని చెప్పారు. ఇప్పటివరకు మిల్లర్ల నుంచి రూ.105 కోట్లు వరకు బ్యాంకు గ్యారంటీ వచ్చిందని, 1 : 3 నిష్పత్తిలో ధాన్యం కేటాయించడం జరుగుతుందని చెప్పారు. ఇకనుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.